సాక్షి
ప్రకాశం

సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



ప్రజలను చైతన్యవంతం చేయాలి

వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ ఆధ్వర్యంలో ఒంగోలులో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బాలినేని ప్రణీత్‌రెడ్డి, శ్రీకావ్య దంపతులు పాల్గొన్నారు. - 8లో..



ఓటుహక్కు వినియోగించుకోవాలి

వచ్చేనెల 13న జరిగే ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఒంగోలు పార్లమెంట్ ఎన్నికల అబ్జర్వర్ హసీబ్ ఉర్ రెహమాన్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
43/28

వాతావరణం

ఎండతీవ్రత పెరుగుతుంది.
వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది.
వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సత్తాచాటిన నంద్యాల జిల్లా ఎడ్ల జతలు

రాచర్ల: మండలంలోని సోమిదేవిపల్లెలో గణపతి, పోలేరమ్మ, అంకాలమ్మ, వీరభద్ర, నాగులమ్మ, నందీశ్వర, ప్రసన్నాంజనేయస్వామి, కాశీవిశ్వనాథ, మారెమ్మ, పోతురాజు, నాభి శిల, లక్ష్మీజగన్నాథస్వామి, ధ్వజ, శిఖర, కుంభాభిషేకం, ప్రతిష్టా మహోత్సవాల సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 4 గంటల సమయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా శిరివేళ్ల మండలం గుంపులమాన్‌దిన్నె గ్రామానికి చెందిన కుందురు భూపాల్‌రెడ్డికి చెందిన ఎడ్లు సత్తాచాటాయి. ఈ పోటీల్లో మొత్తం 7 జతలు పాల్గొనగా కుందురు భూపాల్‌రెడ్డికి చెందిన ఎడ్లు నిర్ణీత 20 నిమిషాల్లో వెయ్యి అడుగులు లాగి మొదటి బహుమతి సాధించాయి. బాపట్ల జిల్లా బల్లికురువ మండలం బల్లికురవ గ్రామానికి చెందిన పి.వీరయ్యస్వామి చౌదరి ఎడ్లు 564 అడుగులు లాగి రెండో బహుమతిని సాధించగా, రాచర్ల మండలం జేపీ చెరువు గ్రామానికి చెందిన బొర్ర రవితేజ ఎడ్ల జతలు 512 అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి.

సీఎం జగన్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన


హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సురేష్

టంగుటూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 30న టంగుటూరు రానున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక జానో బేజరీ సమీపంలో హెలీప్యాడ్ ఏర్పాట్లను, టంగుటూరు సెంటర్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బహిరంగ సభ ప్రాంగణాన్ని మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్, సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, పోలీసు అధికారులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి హెలీప్యాడ్ పనులు, హెలీప్యాడ్ నుంచి సభ ప్రాంగణానికి రోడ్డు మార్గం పరిశీలించి, సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట రాచగర్ల పిచ్చయ్య యాదవ్, చింతపల్లి హరిబాబు, కోటేశ్వరరావు, భరత్ రెడ్డి, భాస్కరరెడ్డి ఉన్నారు.

■ తగువులే తలంపు

పసుపు దండు హత్యాకాండ



అవు చేలో మేస్తే.. దూడ గట్టున మేస్తుందా?
టీడీపీ అధినేత నారా చంద్రబాబు యుక్తాయుక్త విచక్షణ మరిచి 'రాళ్లతో కొట్టండి.. కర్రలతో బాదండి..' అని సెలవిస్తే పచ్చదండు ఊరుకుంటుందా?
'నిన్ను చంపితే ఏం చేస్తావ్..' అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.
టీడీపీ నేతల గత వైఖరిని మరోసారి గుర్తు చేస్తున్నాయి.
'ఓటు వేయకుంటే పోటు.. అడ్డు తగిలితే వేటు'.. స్థూలంగా చెప్పాలంటే టీడీపీ సిద్ధాంతం ఇదే.

ప్రజల ఆశీస్సులతో గద్దెనెక్కాలనే ఆలోచనకే తావు లేకుండా తమకు తెలిసిన 'దండన' విద్యనే పచ్చ నేతలు నమ్ముకున్నారు. నిత్యం తగువులే తలంపుగా వ్యవహరిస్తూ ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తలతో కయ్యానికి కాలు దువ్వుతున్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో టీడీపీ నేతల వికృత క్రీడకు బలైన రాజకీయ నాయకులు జిల్లాలో పదుల సంఖ్యలో ఉన్నారు. అంతకు పది రెట్ల మంది అక్రమ కేసులు ఎదుర్కొన్నారు. పచ్చటి పల్లెల్లో చిచ్చుపెట్టడమే కాకుండా తమ అహానికి, అవినీతికి అడ్డు వస్తున్నారనే కారణంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు మళ్లీ బరితెగించారు.

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

అధికారాన్ని అడ్డంపెట్టుకుని పచ్చమూకలు రెచ్చిపోయాయి. పల్లెల్లో దాడులకు తెగబడ్డాయి. తమకు అడ్డువస్తే అంతమొందించడమే లక్ష్యంగా రెచ్చిపోయాయి. నేడు అధికార పక్షంపై వికృత రాతలతో శునకానందాన్ని పొందుతున్న పచ్చమీడియా నాడు కళ్లుండి చూడలేదని కబోదుల్లా చోద్యం చూశాయి. 2014 నుంచి 2019 మధ్య తెలుగుదేశం పార్టీ అరాచకాల్లో కొన్ని ప్రధాన ఘటనలు

రాళ్లదాడిలో వైఎస్సార్ సీపీ కార్యకర్త బలి


ఎనిమిరెడ్డి పెదబ్రహ్మారెడ్డి మృతదేహం (ఫైల్)

పొన్నలూరు మండలంలోని లింగంగుంట గ్రామంలో 2018 సెప్టెంబర్‌లో వినాయక నిమజ్జనం సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ వర్గీయులు రంగునీళ్లు చల్లి రెచ్చగొట్టారు. మరుసటి రోజు ఉదయం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు కొందరు బహిర్భూమికి వెళ్లి వస్తున్న సమయంలో మాటువేసిన టీడీపీ నాయకులు కొందరు ఇంటిపైకి ఎక్కి ఒక్కసారిగా ఇటుక రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఎనిమిరెడ్డి పెదబ్రహ్మయ్య చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు.

ఎంపీటీసీ భర్తను చంపారు

2014 స్థానిక సంస్థల ఎన్నికల్లో మద్దిపూడి మండలం కెల్లంపల్లి సెగ్మెంట్ నుంచి వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యురాలిగా తేలుకుట్ల గురవమ్మ పోటీ చేశారు. ఏప్రిల్ 11న గోసుకొండ అగ్రహారంలో పోలింగ్ బూత్ వద్ద టీడీపీ కార్యకర్తలు దాడికి తెగబడటంతో గురవమ్మ భర్త వెంకయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన ఒంగోలులో చికిత్స ఎపొందుతూ మృతి చెందారు. ఏడాది వ్యవధికే దిగులుతో గురవమ్మ కూడా కన్ను మూసింది.

దాడులకు అంతే లేదు..

■ పీసీపల్లిలో 2017 జూలైలో వైఎస్సార్ సీపీ ఎంపీపీ బత్తుల అంజయ్యపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నేతలు దాడి చేసి గాయపరిచారు.

■ 2015 ఫిబ్రవరిలో శివరాత్రి సందర్భంగా నారాయణ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను తొలగించారు. దీనిపై ప్రశ్నించిన అప్పటి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌తోపాటు మరో ఏడుగురిపై అక్రమంగా కేసులు బనాయించారు.

■ కొండపి నియోజకవర్గంలో అయ్యప్ప రాజుపాలెంలో ఎంపీటీసీ ఎన్నికల రోజున ఐదుగురిపై దాడి చేసి గాయపరిచారు. జరుగుమల్లి మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.జయబాబుపై టీడీపీ నేతలు దుర్మార్గంగా రేప్ కేసు పెట్టించారు.

■ టంగుటూరు మండలం పొందూరు గ్రామంలో సాధారణ ఎన్నికల సమయంలో వెంకట్రావు అనే వ్యక్తి ఏజెంట్‌గా కూర్చున్నాడని అతనికి చెందిన రూ.5 లక్షల విలువ చేసే పొగాకును టీడీపీ నాయకులు తగలబెట్టారు.

■ 2014లో జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక సమయంలో టీడీపీ బరితెగించింది. మార్కాపురం జెడ్పీటీసీ రంగారెడ్డి ఓటింగ్‌లో పాల్గొనకుండా చేసేందుకు ఎస్సీ, ఎస్టీ కేసు పేరుతో అరెస్టు చేయించారు.

దాడులు, దౌర్జన్యాలు, దమనకాండే టీడీపీ అజెండా

- రాజకీయ హత్యలను ప్రేరేపించడంలో చంద్రబాబు దిట్ట
- నిన్ను చంపితే ఏం చేస్తావ్ అంటూ సీఎం వైఎస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు
- జిల్లాలోనూ దారుణాలకు తెగబడిన పచ్చనేతలు
- ప్రత్యర్థులపై దౌర్జన్యాలు.. అక్రమ కేసులతో బెదిరింపులు


ఒంగోలు కమ్మపాలెంలో బాలినేనిపైకి చెప్పు విసురుతున్న టీడీపీ కార్యకర్త (ఫైల్)

గాజులపల్లెలో దాష్టీకం

2014 ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించిందని పుల్లలచెరువు మండలం మర్రివేముల నుంచి ఆ పార్టీ శ్రేణులు ర్యాలీగా బయలుదేరారు. మార్గమధ్యంలో గాజులపల్లెలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను రెచ్చగొట్టడమే కాకుండా మర్రివేముల నుంచి 100 మంది టీడీపీ కార్యకర్తలను తీసుకెళ్లి దమనకాండ సృష్టించారు. ఇళ్లలోకి చొరబడి ఆడా మగా తేడా లేకుండా బయటకు లాక్కుని వచ్చి విచక్షణా రహితంగా దాడి చేశారు. బీరువాలు పగలగొట్టి రూ.2 లక్షల సొమ్ము లూటీ చేశారు. మమ్ము రమణ అనే నిండు గర్భిణిని కాలితో తన్నడంతో ఆమెకు అబార్షన్ చేయాల్సి వచ్చింది. మమ్ము చిన్న అంజయ్య అనే వ్యక్తిపై దాడి చేయడంతో ఎముకలన్నీ విరిగి ఊపిరితిత్తులకు గాయాలయ్యాయి. సుమారు పది వాహనాలను కూడా ధ్వంసం చేశారు. పురుగుమందు డబ్బాలు తెచ్చి కొందరిపై పోసి రాక్షసానందం పొందారు.


పుల్లలచెరువులో టీడీపీ మూకలు లూటీ చేసిన బీరువా (ఫైల్)

నడిరోడ్డుపై దారుణ హత్య



పీసీపల్లి మండలం అలవలపాడు గ్రామంలో రేషన్ షాపు ఎపొందడం కోసం టీడీపీ నాయకులు బరితెగించారు. 2014 జూన్ 23న గోగడి సింగయ్య, ఆయన అక్క కంచర్ల తిరపతమ్మ, సింగయ్య కుమారుడు సురేష్‌ను టీడీపీ నాయకులు దారుణంగా కొట్టారు. సింగయ్య తలపై కర్రలు, ఇనుప రాడ్లతో మోది పొట్టనపెట్టుకున్నారు.

రెచ్చగొట్టి.. అక్రమ కేసులు పెట్టి..

■ ఒంగోలు నగరంలోని కమ్మపాలెంలో ఆలూరి శ్రీహరి ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు వెళ్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డిని 2019లో టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. రోడ్డుకు అడ్డుగా ట్రాక్టర్ పెట్టడమే కాకుండా, బూతులు తిడుతూ.. తొడలు చరుస్తూ టీడీపీ కార్యకర్తలు రాళ్ల వర్షం కురిపించారు. దాడికి దిగడమే కాకుండా పోలీసులపై ఒత్తిడి తెచ్చి బాలినేనితోపాటు ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డి, మరికొందరిపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టించారు. కమ్మపాలెంలో దళితులు నివసించే ప్రాంతాల్లో డ్రెయినేజీ, రోడ్లు, పబ్లిక్ టాయ్‌లెట్‌కు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినా టీడీపీ నేతలు అడ్డుపుల్ల వేశారు. కమ్మపాలెంలో 119 మంది దళితులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చిన స్థలాల్లోకి వారిని వెళ్లనివ్వకుండా దామచర్ల అడ్డుకున్నారు. దళితులు మొత్తుకుంటున్నా వినకుండా ఆ స్థలంలో గుండా డ్రెయినేజీ నిర్మించి జులుం ప్రదర్శించారు.

■ ఒంగోలు సమతా నగర్‌లో బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు శ్రీకావ్య ప్రచారానికి ఉద్దేశపూర్వకంగా అడ్డుతగిలిన పచ్చ మందలో మేడికొండ మోహన్‌రావు, ఏఆర్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ చౌదరి, ఆయన భార్య కీలకంగా ఉన్నారు. సాటి మహిళ అని కూడా చూడకుండా ఏఆర్ కానిస్టేబుల్ భార్య మాట్లాడిన బూతులు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.

■ స్కిల్ కుంభకోణంలో చంద్రబాబు అరెస్టయిన రోజున బండ్లమిట్టలోని దుకాణాలపై టీడీపీ నేతలు తెగబడ్డారు. ఓ ముస్లిం యువకుడిపై మూకుమ్మడిగా దాడి చేయడమే కాకుండా, దుకాణం షట్టర్ మూతవేసి హల్‌చల్ చేశారు. గాయపడిన ముస్లిం యువకుడు తృటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ దాడిలో కీలక సూత్రధారి, సమతానగర్‌లో రచ్చకు కారణమైన మేడికొండ మోహన్‌రావే. నగరంలో రాజకీయ ఘర్షణలు ఎక్కడ జరిగినా మోహన్‌రావు పేరే ప్రధానంగా వినిపిస్తోంది.

■ మోటా నవీన్ అనే ఎస్టీ యువకుడిని చితకబాది ముఖంపై మూత్రం పోసిన కేసులో నిందితుడు రామాంజనేయ చౌదరికి ఆశ్రయం కల్పించి పోలీసులకు చిక్కకుండా కొద్ది రోజులపాటు అడ్డుపడింది మోహన్‌రావే అన్న ఆరోపణలున్నాయి. దాడి కేసులో జైలుకు వెళ్లి వచ్చిన మోహన్‌రావును ముందు పెట్టి దామచర్ల జనార్దన్ ఆడిస్తున్న డ్రామాలను ఎల్లో పత్రిక ప్రముఖంగా ప్రచురించడం నగరంలో తీవ్ర చర్చనీయాంశమైంది.

బీసీ ఉప కులాలకు గుర్తింపు తెచ్చింది జగనన్నే

- సిక్సర్ విజయానికి అవకాశం ఇవ్వండి
- మంచి పేరుతో రాజకీయాలను విరమిస్తా
- విశ్వబ్రాహ్మణ వర్గీయుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: బీసీలలోని ఉపకులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని వేమూరి కళ్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం వైఎస్సార్ సీపీ బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు సుతారం శ్రీనివాసులు ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ వర్గీయుల ఆత్మీయ సమావేశంలో బాలినేని ముఖ్య అతిథిగా మాట్లాడారు. టీడీపీ వారు మాకు బీసీలు అండగా ఉంటారని చెప్పుకుంటారని ఎన్టీఆర్ ఉన్నప్పుడు మాత్రమే బీసీలు అండగా ఉన్నారని, కానీ చంద్రబాబు వారికి ఏం చేశాడని అండగా ఉంటారని బాలినేని ప్రశ్నించారు. సీఎం జగన్ బీసీలకు అనేక సంక్షేమ పథకాలు ఇవ్వడమే కాక ప్రస్తుతం జరగబోయే ఎన్నికల్లో 50 శాతం టికెట్లు కేటాయించారని గుర్తు చేశారు. ఎంఎల్‌సీ, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు వంటి నామినేటెడ్ పదవులు ఇచ్చారన్నారు. గతంలో జగనన్న సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని చంద్రబాబు ఆరోపించాడని.. నేడు జగనన్న ఇస్తున్న సంక్షేమ పథకాలకు సంవత్సరానికి రూ.70 వేల కోట్లు కావాల్సి ఉంటే, చంద్రబాబు ఇస్తానన్న పథకాలకు రూ.లక్ష 50 వేల కోట్లు అవసరమని వివరించారు. గతంలో 600 హామీలు ఇచ్చి కేవలం 10 శాతం హామీలు మాత్రమే అమలు చేశారని, అదే జగనన్న తాను చెప్పిన హామీలను 99 శాతం అమలు చేశాడన్నారు. నేడు జగనన్న 2019, 2024 సంవత్సరాల మేనిఫెస్టోలను చూపించి చెప్పింది చేశా ఓట్లు వేయమని అడుగుతున్నాడని, ఆవిధంగా చంద్రబాబుకు 2014 మేనిఫెస్టోను చూపించి ప్రజలను ఓట్లు అడిగే దమ్ము, ధైర్యం ఉందా అని బాలినేని ఛాలెంజ్ విసిరారు. 2022వ సంవత్సరంలో పేదలకు పట్టాలు ఇవ్వాలని సిద్ధం చేస్తే ప్రభుత్వ, మైనింగ్ భూములని టీడీపీ నాయకులు కోర్టును ఆశ్రయించి పంపిణీని అడ్డుకున్నారన్నారు. తాను ఇళ్ల పట్టాల కోసం 500 ఎకరాలు సిద్ధం చేస్తే ప్రతిపక్షాలు పట్టాలు ఇస్తామని మోసం చేస్తున్నారని ప్రచారం చేశారని.. తాను జగనన్నపై ఒత్తిడి పెంచి రూ.230 కోట్లతో స్థలం కొనుగోలుచేసి 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని, ఇంకా 4 వేల పట్టాలు ఇవ్వటానికి స్థలం సిద్ధంగా ఉందని బాలినేని వివరించారు. కానీ ఆ పట్టాలను ప్రతిపక్షాలు ముఖ్యంగా టీడీపీ, అనుకూల పచ్చ మీడియా దొంగ పట్టాలని ప్రచారం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. అవి దొంగ పట్టాలని దమ్ముంటే నిరూపించాలని సవాల్ విసిరారు. విశ్వబ్రాహ్మణులందరికీ ఒకేచోట ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఎన్నికలు అయిపోగానే ఇళ్లు కూడా కట్టించి ఇస్తామని తెలిపారు. తనను ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, చివరిసారి గెలిపించి సిక్సర్ విజయం సాధించేలా సహకరించాలని కోరారు. అనేక మంచి పనులు చేశానని ఈసారి కూడా మంచి పని చేసి రాజకీయాల నుంచి రిటైర్ అవ్వాలని కోరుకుంటున్నానన్నారు. ఈ ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా నాకు, ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పవిత్ర మురళీకృష్ణ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులకు జగనన్న ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని, రాష్ట్రంలో మన కులం వారికే ఎక్కువ మందికి ఇళ్లపట్టాలు ఇచ్చాడని, విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన ఘనత జగనన్నకే దక్కుతుందని అన్నారు. విశ్వబ్రాహ్మణులందరూ జగనన్నకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బాలినేని సుతారం శ్రీనివాసులు గజమాలతో ఘనంగా సత్కరించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కటారి శంకరరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రావూరి లక్ష్మయ్య, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట రజని, పార్టీ పట్టణ జాయింట్ సెక్రటరీ కొలకలూరి శ్రీనివాసులు, విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపం అధ్యక్షుడు చోడా శ్రీనివాసులు, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు వేల్పూరి రామారావు, పార్టీ నాయకులు ఇంకొల్లు శ్రీహరిబాబు, హేమంత్‌కుమార్, సుతారం సుధ, రాపూరి అంజి, రావినూతల విశాలి, తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి అండగా ఉంటా..


పార్టీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్, మాజీ మంత్రి శిద్దా రాఘవరావును గజమాలతో సన్మానిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

- నేనూ మీ కుటుంబ సభ్యుల్లో ఒకడిని
- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి
- అందరికీ మంచి చేయడమే లక్ష్యంగా పనిచేస్తానన్న దద్దాల నారాయణ యాదవ్
- జగనన్నను సీఎం చేయడమే లక్ష్యంగా ఆర్యవైశ్యులు పనిచేయాలన్న శిద్దా రాఘవరావు
- ఆత్మీయ సమ్మేళనానికి భారీగా తరలి వచ్చిన ఆర్యవైశ్యులు

కనిగిరి రూరల్: "నేను ఆర్యవైశ్య కుటుంబ సభ్యుల్లో ఒకడిని.. ఆశీర్వదించండి... భవిష్యత్తులో మీకు ఏ అవసరమొచ్చినా అండగా నిలబడతానని" వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. స్థానిక పవిత్రా కళ్యాణ మండపంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళన సభ వాసవీ సత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉందన్నారు. ఆర్యవైశ్యులు నీతి, నిజాయితీకి మారుపేరని కొనియాడారు. మాట ఇస్తే నిలబడతారని, ఆర్యవైశ్యులంటే ఓ నమ్మకం అని చెప్పారు. మీలో ఒకడిగా ఉన్నానని...అన్ని విషయాల్లో విశ్వాసంగా, కష్టసుఖాల్లో అండగా ఉంటానని చెప్పారు. తాను ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ఆర్యవైశ్యులతో చర్చించిన తర్వాతే ముందడుగు వేస్తానని వెల్లడించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఆర్యవైశ్యులంతా వైఎస్సార్ సీపీకి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని.. ఎవరి ప్రమేయం లేకుండా మీకు వచ్చిన ఇబ్బందులపై తక్షణం స్పందించి పరిష్కరిస్తానన్నారు. తానూ వ్యాపార రంగానికి చెందిన వాడినేనని.. మీ కష్ట సుఖాలు పూర్తిగా తెలుసన్నారు. ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సాయం చేస్తానని భరోసా ఇచ్చారు. జగనన్న దీవెనలు.. వాసన్న ఆశీస్సులతో మీ ముందుకు వచ్చానన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఆర్య వైశ్యులంతా ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, వేయించి తనను ఎమ్మెల్యేగా, చెవిరెడ్డి భాస్కరరెడ్డిని ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్నను మళ్లీ సీఎం చేయాలని కోరారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ఆర్యవైశ్యులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఆర్యవైశ్యులకు అన్ని రంగాల్లో అత్యధిక ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఆర్యవైశ్యులంతా జగనన్నకు అండగా నిలబడాలన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఆర్యవైశ్యులకు ఎంతో ఉందని వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా దద్దాల నారాయణ యాదవ్‌ను, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించి జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, యాదాల సాయి, దేవకి రాజీవ్ మాదాల సుబ్బారావు, దేవకి సత్యవతి, అయితా సుబ్బయ్య, గోంట్లా మల్లికార్జునరావు, దేవకి సుబ్రహ్మణ్యం, బచ్చు వెంగళరావు, బాదం సత్యన్నారాయణ, తడికమళ్ల వెంకటేశ్వర్లు, కనమర్ల పులి లక్ష్మీ మోహన్, రాము, రమేష్, సురేష్, ఉప్పాల నర్సింహారావు, టంగుటూరి గోవిందరావు, ఆరు మండలాల ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

పేదల తలరాత మార్చిన సీఎం జగన్

- ఎన్నికల ప్రచారంలో మంత్రి ఆదిమూలపు సురేష్


సన్నమూరులో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్


చిమటలో ప్రచారంలో పాల్గొన్న డాక్టర్ ఆదిమూలపు సురేష్

మద్దిపూడి: వివిధ సంక్షేమ పథకాల అమలుతో పేదల తలరాతలు మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదివారం అన్నారు. విద్య, వ్యవసాయం, వైద్యానికి ఎన్నికల మేనిఫెస్టోలో అధిక ప్రాధాన్యం ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు మనమంతా మద్దతు ఇవ్వాలని కోరారు. మండలంలోని అంకేపల్లి పంచాయతీ సన్నమూరు, చిమట, పన్నూరు, గుండ్లసముద్రం గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ×పల్లెపల్లెకు సురేష్ సిద్ధం¥ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో స్వర్ణయుగంలా సాగిందని వివరించారు. ప్రధానంగా మహిళల పేరిట అన్ని పథకాలు అందించి సీఎం జగన్ మహిళా పక్షపాతి అయ్యారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్ మోహన్‌రెడ్డిదన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమాన్ని అందించారని చెప్పారు. రాష్ట్రంలో వైఎస్సార్ ప్రభంజనం వీస్తోందన్నారు. వచ్చే నెల 13 వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, కొండపి ఎమ్మెల్యేగా తనకు కేటాయించిన ఫ్యాన్ గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ముందుగా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు మండల వైఎస్సార్ సీపీ శ్రేణులు మేళతాళాలు, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సురేష్ ముందుకు సాగారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, తూమాటి నర్సింహారెడ్డి, మాకినేని వెంకట్రావు, బోగసముద్రం విజయభాస్కర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డాల మల్లికార్జున, బోడ రమణారెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, బీపీ భాస్కర్‌రెడ్డి, మాచేపల్లి నాగయ్య, పీ సంజీవరెడ్డి, వెంకట్రావు, పీ రామిరెడ్డి, కోటిరెడ్డి, పీ సుబ్బారెడ్డి, ఏ వెంకటరెడ్డి, వీ మల్లికార్జునరెడ్డి, ఆర్ కొండయ్య, ఏ జయరామిరెడ్డి, ఏ ఇజ్రాయిల్, తిరుపతమ్మ, నర్సింహారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆస్తి తగాదాలతో యువకుడి హత్య


హత్యకు గురైన వెంకటేష్


చికిత్స పొందుతున్న తిరుపతమ్మ

దర్శి: ఆస్తి తగాదాల నేపథ్యంలో మాటరాజ వెంకటేష్ (26) అనే యువకుడు హత్యకు గురైన ఘటన మండలంలోని రాజంపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్సై సుమన్ తెలిపిన వివరాల మేరకు.. తర్లుపాడు మండలం పోతలపాడు గ్రామానికి చెందిన మాటరాజ వెంకటేష్ తన సోదరి గ్రామమైన దర్శి మండలం రాజంపల్లికి ఆస్తి తగాదాల పరిష్కారానికి వచ్చాడు. ఆస్తుల విషయంలో మాటమాట పెరిగి రెండో వర్గం వారు వెంకటేష్ పై కత్తులతో దాడిచేసి గాయపరిచారు. దీంతో తీవ్ర గాయాలతో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. అడ్డుకోబోయిన తిరుపతమ్మ అనే మహిళకు కూడా తీవ్ర గాయమైంది. స్థానికులు 108కి సమాచారం ఇవ్వటంతో ఈఎంటీ గౌస్‌బాషా, పైలట్ నరేష్ బాబులు తిరుపతమ్మకు ప్రథమ చికిత్సచేసి మెరుగైన వైద్యం కోసం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు వెంకటేష్‌కు వివాహం కాలేదు. డిగ్రీ వరకు చదువుకున్నాడు. యువకుడి హత్యతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పీసీపల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వెంగళాయపల్లి సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వరిమడుగు గ్రామానికి చెందిన కొడవటిగంటి శ్యాంసన్ (34) పెదఇర్లపాడు వెళ్తుండగా వెంగళాయపల్లి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తలకి, ఇతర శరీర భాగాలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే ఇతనిని పీసీపల్లి ప్రాథమిక వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో కనిగిరికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు బంధువులు తెపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్యాంసన్ మృతికి వైఎస్సార్ సీపీ నాయకులు గోపవరపు బొర్రారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీకాంతం ఓకేరెడ్డి, సొసైటీ చైర్మన్ పోలు జయరామిరెడ్డి, ఎంపీపీ అత్యాల జపన్య, సర్పంచ్ మోతుకూరి నరేంద్ర చౌదరి తదితరులు నివాళులర్పించారు.

ఆశీర్వదించండి..అండగా ఉంటా


మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున


మేరుగు నాగార్జునను సత్కరిస్తున్న సంతనూతలపాడు వాసులు

- ఓటేయటానికి ఒకరికొకరు కలుపుకొని రండి
- సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన హైదరాబాద్ సెటిలర్స్‌తో ఆత్మీయ సమావేశంలో మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: రానున్న ఎన్నికల్లో నన్ను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించండి. మీకు అండగా ఉండి సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి, సంతనూతపాడు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేరుగు నాగార్జున అన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన హైదరాబాద్ సెటిలర్స్‌తో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ ఫంక్షన్ హాలులో ఆదివారం సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన సెటిలర్స్‌తో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ ఎన్నికలకు ఒక రోజు ముందే ఒకరికొకరు కలుపుకొని స్వంత గ్రామాల్లోకి వచ్చి ఓటేయాలని, అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనకు ఒక ఓటు, బాపట్ల పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నందిగం సురేష్‌కు మరో ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటేయటం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలతో రాష్ట్రంలోని ప్రజలకు సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ నిరంతరం అందించగలుగుతారన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పలు వ్యాపారాలు, విద్య, ఉద్యోగాల్లో స్థిరపడిన వారిని ఇలా కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని మంత్రి మేరుగ నాగార్జున ఆప్యాయంగా ప్రతి ఒక్కరినీ పలకరించారు. హైదరాబాద్‌లో సెటిలైన వారిని ఆత్మీయ సమావేశం పేరిట ఒక చోటకు చేర్చటంలో మారెడ్డి చెంచురామిరెడ్డి, ఓరుగంటి సురేంద్రరరెడ్డి, వాకా సంజీవరెడ్డి, కంచి సీతారామిరెడ్డి, వల్లంరెడ్డి సత్యవర్థన్‌రెడ్డి, వాకా శ్రీనివాసరెడ్డితో పాటు కుంచాల రాంబాబు, కత్తి రమణారెడ్డి కృషి చేశారు. చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లోని 85 పంచాయతీల్లో ప్రతి గ్రామం నుంచి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వారిలో ఎక్కువ మంది విద్యార్థులు, బేల్దార్ పనులు, బిల్డర్లుగా, ఐటీ రంగం, మేస్త్రీలుగా, వ్యాపారాలు, చిరువ్యాపారాలు, చిరుద్యోగాలలో స్థిరపడిన వారే ఉన్నారు. నియోజకవర్గానికి చెందిన వారు 4 వేల మంది వరకు ఉన్నట్లు అంచనా. వారిలో ఆత్మీయ సమావేశానికి 1500 మందికి పైగా హాజరయ్యారు. ఆత్మీయ సమావేశానికి హాజరైన వారందరినీ, నిర్వాహకులను మంత్రి మేరుగు నాగార్జున అభినందించారు.

మేనిఫెస్టోపై ప్రజలను చైతన్యవంతం చేయాలి

- వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో భారీ ర్యాలీ
- అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీని ప్రారంభించిన బాలినేని ప్రణీత్‌రెడ్డి, శ్రీకావ్య
- పాల్గొన్న నగర మేయర్ గంగాడ సుజాత, ఐటీ వింగ్ రాష్ట్ర కార్యదర్శి సునీల్ పోసింరెడ్డి


ర్యాలీ అనంతరం మాట్లాడుతున్న బాలినేని శ్రీకావ్య


ఐటీ వింగ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

ఒంగోలు: వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ గెలుపును కాంక్షిస్తూ ఒంగోలు నగరంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక హెచ్‌సీఎం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ యువనాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి, శ్రీకావ్య దంపతులతో పాటు వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ నాయకులు, స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ట్రంకురోడ్డు, మస్తాన్‌దర్గాసెంటర్, పాత మార్కెట్ సెంటర్ మీదుగా స్థానిక శ్రీబాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వద్ద ఉన్న మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా యువత పెద్ద ఎత్తున పాల్గొని కూటమితో యుద్ధానికి మేము సిద్ధం అంటూ నినాదాలు చేశారు. అనంతరం నగర మేయర్ గంగాడ సుజాత, ఐటీ వింగ్ రాష్ట్ర కార్యదర్శి సునీల్ పోసింరెడ్డి తదితరులు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల రాక గతం కంటే పెరిగిందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నిరుద్యోగ యువతకు శిక్షణతో పాటు స్టైఫండ్ కేటాయింపు, అనంతరం వందశాతం ఉపాధి కల్పనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇవ్వడం ప్రతి ఒక్కరికీ ఆనందదాయకం అన్నారు. రాష్ట్రానికి ఒక స్కిల్ యూనివర్శిటీ, ప్రతి జిల్లా కేంద్రంలో ఒక స్కిల్ కాలేజీ, ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్ ద్వారా రాష్ట్రంలోని పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తూ వచ్చే ప్రభుత్వంలో నిరుద్యోగాన్ని గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టో ప్రకటించారన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. మనం చేయగలిగేవే చెప్పామని, కానీ ప్రతిపక్షాలు మాత్రం కేవలం ప్రజలను నమ్మించి మోసం చేయాలనే లక్ష్యంగా ఏర్పాటుచేసిన మేనిఫెస్టోపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐటీ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరీష్‌రెడ్డి, సభ్యుడు వెంగళ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, గంటా రామానాయుడు, మారెడ్డి రామకృష్ణారెడ్డి, నరాల రమణారెడ్డి, నత్తల భీమేష్, మహిళా విభాగం జిల్లా, నగర అధ్యక్షులు తమ్మినేని మాధవి, చింతగుంట్ల సువర్ణ, ఐటీ కంపెనీ ఎండీ ప్రియ, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రాజిరెడ్డి, కో కన్వీనర్ హిమబిందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యలో వినూత్న సంస్కరణలు

- ఐటీ వింగ్ ఆత్మీయ సమ్మేళనంలో తాటిపర్తి చంద్రశేఖర్


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర విద్యావిధానంలో వినూత్న సంస్కరణలు తీసుకొచ్చి పేదింటి పిల్లలు ఉన్నత చదువులు చదివేందుకు బాటలు వేశారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ యర్రగడ్డలోని మాజిస్టిక్ గార్డెన్‌లో ఏపీకి చెందిన ఐటీ వింగ్, ఫార్మా ఉద్యోగులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకీకరించి ప్రతి స్కూల్‌లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పిల్లలు ఇంగ్లిష్ చదువులు చదవగలుగుతున్నారని, బడికి వెళ్లే పిల్లలు తల్లిదండ్రులకు భారం కాకూడదని అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాలను అమలు పరిచారని అన్నారు. యువ ఉద్యోగులు వైఎస్సార్, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి అమలు పరచిన ఫీజురీయింబర్స్‌మెంట్‌తో చదుకున్నవారు అనేక మంది ఉన్నారని అన్నారు. తాజాగా జగనన్న విడుదల చేసిన మేనిఫెస్టో జనరంజకంగా ఉందని, నవరత్నాల పథకాలను కొనసాగిస్తూ, ఆ పథకాల్లో అందరికీ ఆమోద యోగ్యంగా మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. జరగబోయే ఎన్నికల్లో ఏదో ఒక రకంగా అధికారంలోకి రావాలన్న ఉద్దేశంతో చంద్రబాబు ఒక కర్రకు టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలను కట్టుకొని రాష్ట్రంలో సంచరిస్తున్నాడని వ్యంగ్యంగా అన్నారు. అన్ని వర్గాల మేలుకోరే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకొని రాష్ట్రాన్ని మరింత ప్రగతి పథంలో నడుపుకుందామని, ఆయన ప్రతినిధులుగా యర్రగొండపాలెం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి పోటీ చేస్తున్నామని, వచ్చేనెల 13వ తేదీన జరిగే పోలింగ్ నాటికి అందరూ తమ స్వగ్రామాలకు చేరి మీతోపాటు కుటుంబ సభ్యులు, ఆత్మీయులతో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయించాలని, తామిద్దరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ముందుగా ఆయన వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆత్మీయ సమ్మేళనంలో నియోజకవర్గ అబ్జర్వర్ వెన్నా హనుమారెడ్డి, ఇరిగేషన్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ దుగ్గెంపూడి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నాయకులు సయ్యద్ జబీవుల్లా, యల్లేష్ యాదవ్, పోలిరెడ్డి, బెజవాడ గురవయ్య పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న ఐటీ ఉద్యోగులు

చరిత్రలో నిలిచేలా జగనన్న మేనిఫెస్టో

- ఆచరణ సాధ్యమైన హామీలతోనే ప్రజాక్షేత్రంలోకి
- మోసాల చంద్రబాబు చరిత్ర హీనుడిగా మిగిలారు
- వైఎస్సార్ సీపీ కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్


మాట్లాడుతున్న కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్, నేతలు

కనిగిరి రూరల్: పాదయాత్ర స్ఫూర్తితో పాలన చేసి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి మళ్లీ ఆచరణ సాధ్యమైన, ప్రణాళికాబద్ధమైన మేనిఫెస్టో విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర పుటల్లో నిలిచిపోతారని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అధ్యక్షతన నిర్వహించిన విలేకర్ల సమావేశంలో దద్దాల మాట్లాడారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా అమలు చేయడంతో దేశ చరిత్రలోనే చిరస్థాయిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచిపోయారని కొనియడారు. చెప్పాడంటే.. చేస్తాడంతే అనే నమ్మకాన్ని ప్రజల్లో మెండుగా సంపాదించుకున్న నేత వైఎస్ జగన్ అన్నారు. పేద, మధ్యతరగతి వర్గాలకు పెద్ద పీట వేస్తూ జగనన్న మేనిఫెస్టో విడుదల చేశారన్నారు. నవరత్నాల పథకాల ద్వారా గత 58 నెలల్లో పేద కుటుంబాల ఖాతాల్లో రూ 2.70 లక్షల కోట్లను సీఎం జగన్ నేరుగా జమచేసినట్లు వివరించారు. ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీలు, నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ హబ్‌లు, ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ అమలు.. ఇలా చేయగలిగినవే మేనిఫెస్టోలో విడుదల చేశారన్నారు. తద్వారా ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175కు 175 సీట్లు గెలవడం ఖాయమన్నారు. 2014లో ఇదే కూటమి నేతలతో మేనిఫెస్టో విడుదల చేసిన చంద్రబాబు.. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని దద్దాల విమర్శించారు. 2014లో అధికారం దక్కించుకున్నాక ఇచ్చిన 600 హామీలను అమలు చేయకుండా చరిత్ర హీనుడిగా చంద్రబాబు నిలిచారని ఘాటుగా స్పందించారు. టీడీపీవి దొంగ మాటలు, మాయాపత్రాలని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు వైఎస్సార్ సీపీకి మద్దతు పలికేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులంతా ఫ్యాను గుర్తుకు ఓటేసి.. వేయించి తనను ఎమ్మెల్యేగా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్నను మళ్లీ సీఎం చేయాలని దద్దాల నారాయణ పిలుపునిచ్చారు.

ప్రతి అడుగులో విశ్వసనీయత : చింతలచెరువు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, పారిశ్రామిక, రంగాల్లో సంస్కరణలతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో అగ్రగామిగా నిలిపారని ఏపీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చింతలచెరువు సత్యన్నారాయణరెడ్డి అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టో అన్ని వర్గాలకు అండగా నిలిచే విధంగా ఉందన్నారు. అనేక బృహోత్తర పథకాలను అందులో పొందుపరిచినట్లు చెప్పారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి జగనన్న పెద్ద పీట వేశారన్నారు. ప్రజల జీవనశైలి మార్చే విధంగా మేనిఫెస్టో రూపొందించారని కొనియాడారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజలకు ఎటువంటి మేలు జరగలేదని విమర్శించారు.

అన్ని వర్గాలకు మేలు : వైఎం ప్రసాద్‌రెడ్డి

అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసే విధంగా జగనన్న మేనిఫెస్టో విడుదల చేశారని పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆచరణ సాధ్యమైన, అమలు చేసే వాటినే మేనిఫెస్టోలో పెట్టారని తెలిపారు. చంద్రబాబులా అధికారం కోసం ఇష్టానుసారం హామీలిచ్చి ప్రజలను మోసం చేయరని తెలిపారు. క్లారిటీగా రెండు పేజీల్లో ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరంగా చెప్పారన్నారు. 14 ఏళ్లు సీఎంగా పరిపాలన చేసిన చంద్రబాబు పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శించారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజల్లోకి వస్తూ మళ్లీ మోసం చేయాలని చంద్రబాబు చూస్తున్నారని ఘాటుగా విమర్శించారు. కార్యక్రమంలో వాసవీసత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, చింతలచెరువు సూర్య నారాయణరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు బసిరెడ్డి పిచ్చిరెడ్డి, ఎస్‌కే జిలాని, మందాది కృష్ణారెడ్డి, సిరుప గోవర్ధన్‌రెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, జీ అబ్రహం లింకన్, మూలే గోపాల్ రెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, చింతంగుంట్ల కిషోర్, శ్రీరాం సతీష్, ఇర్రి కృష్ణారెడ్డి, ఎస్‌కే ఖాజా, కంటు గురవయ్య, పండ్ల ఖాదర్, మీరావలి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో భాగంగా కందుకూరు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, కనిగిరి వైఎస్సార్ సీపీ అభ్యర్థి దద్దాల నారాయణ

ఆర్ఎంపీ వైద్యులకు అండగా ఉంటా

- ఆర్ఎంపీల ఆత్మీయ సదస్సులో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: ఆర్ఎంపీ వైద్యులకు అన్ని విధాలా అండగా ఉంటానని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక బాలినేని నివాసంలో ఆదివారం ఆర్ఎంపీ వైద్యుల సంఘం నిర్వహించిన ఆత్మీయ సదస్సుకు బాలినేని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిత్యం మీ వద్దకు ఎంతోమంది ప్రజలు వైద్యం కోసం వస్తుంటారని, మీరు చేసే సేవలు అమూల్యమైనవి అన్నారు. తక్కువ ఫీజుతో పేద ప్రజలకు అండగా నిలుస్తున్న మీకు తాను అండగా ఉంటానన్నారు. పేద ప్రజల సంక్షేమం, ఆరోగ్యం పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం ద్వారా నేడు ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండగలుగుతున్నారన్నారు. రాబోయే కాలంలో వైద్యం కూడా విస్తరిస్తుందని, మూడు ప్రాంతాల్లో మూడు ప్రత్యేక కార్డియాక్ సెంటర్లు, క్యాన్సర్ ఆస్పత్రులు సైతం నిర్మించడం ద్వారా పేద, మధ్య తరగతి వర్గాలకు పెనుభారం తగ్గుతుందన్నారు. ఒంగోలులో ఇళ్లపట్టాలు అనేది పేద ప్రజల ఆశ అని, దానిని ఎట్టకేలకు సాధించుకోగలిగామన్నారు. మీలో అర్హులై ఉండి ఎవరికైనా ఇంటి పట్టా రాకపోయి ఉంటే తప్పక పట్టాతోపాటు ఎన్నికలు ముగిసిన 8 నెలల్లోగా ఇళ్లు కూడా నిర్మించి ఇస్తామన్నారు. ఈ ఎన్నికలు తనకు చివరి ఎన్నికలు అని, ఈ అయిదేళ్లు కష్టపడి తన పేరు చిరస్థాయిగా నిలిచేలా కృషిచేస్తానన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కూడా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తనకు తోడుగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యుల మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.సుధాకరరావు, టి.రమేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- కేంద్ర ఎన్నికల అబ్జర్వర్ హసీబ్ ఉర్ రెహమాన్, ఎస్పీ సుమిత్ సునీల్

త్రిపురాంతకం: వచ్చే నెల 13వ తేదీ జరిగే ఎన్నికల పోలింగ్‌లో ప్రతిఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఒంగోలు పార్లమెంట్ ఎన్నికల అబ్జర్వర్ హసీబ్‌ఉర్ రెహమాన్, ఎస్పీ సుమిత్ సునీల్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎవరైనా ప్రలోభాలకు గురిచేసినా.. బెదిరింపులకు పాల్పడినా వెంటనే పోలీస్‌శాఖను సంప్రదించాలని సూచించారు. ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించాలనే లక్ష్యంతో త్రిపురాంతకం మండలం మిట్టపాలెం, ఒడ్డుపాలెం, ఉమ్మడివరంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేకమైన అధికార యంత్రాంగాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అందుకు తగిన ఏర్పాట్లు కూడా చేసిందని తెలిపారు. ఎన్నికలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలీస్ శాఖ అందరికీ అండగా ఉంటుందన్నారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే తమకు తెలియజేయాలని రెహమాన్ సూచించారు. ఎస్పీ సుమిత్ సునీల్ మాట్లాడుతూ ఎన్నికలను ప్రక్రియ సజావుగా, సాఫీగా జరిపించేందుకే కేంద్ర ఎన్నికల కమిషన్ అబ్జర్వర్‌గా జమ్మూకాశ్మీర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి రెహమాన్‌ను నియమించిందన్నారు. ముందుగా ప్రత్యేక పోలీస్ దళాలు ప్రభుత్వ భద్రతా ఏర్పాట్లపై ప్రదర్శన చేశారు. తహసీల్దార్ రామకృష్ణ శివప్రసాద్, డీఎస్పీలు అశోక్‌వర్ధన్, బాలసుందరరావు, సీఐ సుబ్బారావు, ఎస్ఐ సాంబశివయ్య పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పాటించాలి...

అర్థవీడు (బేస్తవారిపేట): ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ సూచించారు.



అర్థవీడు మండలం వెలగలపాయలో మాట్లాడుతున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

ఆదివారం అర్థవీడు మండలంలోని వెలగలపాయ పోలింగ్ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. గ్రామంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. ఓటు హక్కు ప్రాధాన్యత, ఎలక్షన్ సమయంలో ఏం చేయవచ్చు, ఏం చేయకూడదనే విషయాలపై ప్రొజెక్టర్‌తో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు, కంభం సీఐ రామకోటయ్య, తహసీల్దార్ అత్తర్ నాయబ్‌రసూల్, ఎస్సై అనిత తదితరులు పాల్గొన్నారు.

హోమ గుండం దగ్ధం

రాచర్ల: హోమం చేస్తుండగా హోమగుండం దగ్ధమైన సంఘటన మండలంలోని సోమిదేవిపల్లె గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామంలోని గణపతి, పోలేరమ్మ, అంకాలమ్మ, వీరభద్ర, నాగులమ్మ, నందీశ్వర, ప్రసన్నాంజనేయస్వామి, కాశీవిశ్వనాథ, మారెమ్మ, పోతురాజు, నాభిశిల, లక్ష్మీజగన్నాథస్వామి, ధ్వజ, శిఖర, కుంభాభిషేకం ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఆదివారం మారెమ్మ గుడి వెనుక హోమాల కోసం తాటాకు మట్టలతో హోమగుండం ఏర్పాటు చేశారు. అందులో హోమాలు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ నిప్పంటుకుని హోమ గుండం పూర్తిగా మంటల్లో కాలిపోయింది. అందులో ఉన్న హోమాలకు సంబంధించిన విలువైన సామగ్రితో పాటు మైక్ సెట్, స్పీకర్లు కూడా కాలిపోయాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న గిద్దలూరు అగ్నిమాపక సిబ్బంది వెంటనే చేరుకుని మంటలను అదుపు చేశారు.